పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలి

- అదనపు కలెక్టర్ రఘువరన్
- పెగడపల్లి మండలం లింగాపూర్‌లో పర్యటన

పారిశుధ్య పనులపై అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రఘువరన్

పెగడపల్లి, జూన్ 29: వర్షాలు కురుస్తున్నందున గ్రామాల్లో పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టిసారించాలని అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రఘువరన్ అధికారులకు సూచించారు. పెగడపల్లి మండలం లింగాపూర్ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. గ్రామంలో వన నర్సరీ, అమ్మ ఆదర్శ పాఠశాల పనులు, ప్రభుత్వ పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రంలో సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో వర్షపు నీరు నిలిచి ఉండకుండా చూడాలని, దోమల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రక్షిత మంచినీటి పథకాల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. ఇంటితో పాటు పరిసరాలు శుభ్రంగా ఉంచుకునేలా పంచాయతీ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. మొక్కలు నాటేందుకు గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీ శోభ-తిరుపతి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ మహేశ్వరి, పంచాయతీ కార్యదర్శి లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

ప్రజలు ఇబ్బందులు పడకుండా ముందస్తు చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య

మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం ఇస్తున్న కౌన్సిలర్

కోరుట్ల, జూన్ 29: వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నం లావణ్య పేర్కొన్నారు. పట్టణంలోని మున్సిపల్ సమావేశ మందిరంలో చైర్‌పర్సన్ అధ్యక్షతన శనివారం మున్సిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అధికారులు పలు అభివృద్ధి పనుల ఆమోదం కోసం 34 ఎజెండా అంశాలను సభలో ప్రవేశపెట్టగా, పలు అంశాలపై చర్చించిన కౌన్సిల్ సభ్యులు ప్రతిపాదిత అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్‌పర్సన్ మాట్లాడుతూ, వార్డుల్లో రహదారులపై పడిన గుంతలను పూడ్చివేయడానికి రూ. 5 లక్షలు, కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు రూ. 5 లక్షలు, శానిటేషన్ నిర్వహణ కోసం రూ. 10 లక్షలు, మురుగు కాలువలు, కల్వర్టుల నిర్మాణానికి రూ. 15 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా, వరద నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. అంతకుముందు 21వ వార్డు కౌన్సిలర్ అన్వర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌కు వినతి పత్రం ఇచ్చారు. స్థానిక అల్లమయ్య గుట్ట సమీపంలోని ఎమ్మార్, ఆర్ఆర్ ఫంక్షన్ హాళ్లకు పార్కింగ్ సౌకర్యం లేక రహదారిని ఆనుకుని వాహనాలు పార్కింగ్ చేస్తున్నారని, చర్యలు తీసుకోవాలని వినతి పత్రంలో కోరారు. సమావేశంలో మున్సిపల్ ఉపాధ్యక్షుడు పవన్, కమిషనర్ తిరుపతి, ఏఈ లక్ష్మి, టీపీవో ప్రవీణ్, టీపీఎస్ రమ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ గజానంద్, తదితరులు పాల్గొన్నారు.

పవన్‌కళ్యాణ్‌కు స్వామి వారి చిత్రపటం బహూకరిస్తున్న ఆలయ ఉద్యోగులు, అర్చకులు

పవన్‌కళ్యాణ్ పర్యటనలో సైడ్‌లైట్స్

- కొండగట్టు గుట్టపై వై జంక్షన్ వద్దకు ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ శనివారం మధ్యాహ్నం 12.41 గంటలకు చేరుకున్నారు. అక్కడి నుంచి కారు రూఫ్‌టాప్‌ను తెరిచి బయటకు వచ్చి అభిమానులకు అభివాదం చేసుకుంటూ ఆలయం వరకు వచ్చారు. ఆలయ ప్రధాన ద్వారం వద్దకు 1.04 నిమిషాలకు చేరుకున్నారు. ఆలయంలో 30 నిమిషాల విడిదిలో ప్రత్యేక పూజలు, ఆశీర్వచనం పూర్తయ్యాక 1.34 గంటలకు తిరుగు ప్రయాణమయ్యారు. తిరుగు ప్రయాణంలో సైతం అభిమానులకు అభివాదం చేసుకుంటూ వెళ్లిపోయారు.
- ఏపీ ఉప ముఖ్యమంత్రిగా మొదటిసారి కొండగట్టుకు వచ్చిన పవన్‌కళ్యాణ్‌కు కలెక్టర్ సత్యనారాయణ, ఎస్పీ అశోక్‌కుమార్ పూల మొక్కలు అందజేసి స్వాగతం పలికారు.
- ఆలయంలోకి పాత్రికేయులను అనుమతించకపోవడంతో నిరసన తెలిపారు. అనంతరం పోలీసులు అనుమతించారు. ఈ క్రమంలో కొంతమంది పాత్రికేయులు ఆలయ ఉద్యోగులమని నమ్మించి ఆలయంలోకి వెళ్లడంతో పోలీసులకు అధికారులు ఫిర్యాదు చేశారు.
- ప్రధాన గర్భాలయంలో పవన్‌కళ్యాణ్ పర్యటన నేపథ్యంలో ప్రత్యేక విధులు వేయగా వాటన్నింటిని మరిచి అర్చకులే సెల్ఫీలు దిగడంతో పలువురు అసహనం వ్యక్తం చేశారు.
- అభిమానులు చాలా మంది పవన్‌కళ్యాణ్‌తో ఫొటోలు దిగేందుకు కొండగట్టు వద్దకు వచ్చినప్పటికీనీ ఎవరినీ అనుమతించకపోవడంతో నిరాశతో వెనుదిరిగారు.
- భక్తుల రద్దీ, అభిమానుల కోలాహలంతో కొండగట్టు గుట్టంతా జనసంద్రంతో నిండగా, జేబు దొంగలు సందట్లో సడేమీయలా పలువురి జేబులు కత్తిరించారు.

-మల్యాల, జూన్ 29

రైతు భరోసాపై అన్నదాతలతో సమావేశం

మాట్లాడుతున్న డీఏవో వాణి

జగిత్యాల టౌన్, జూన్ 29: జిల్లా కేంద్రంలోని జగిత్యాల ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో జిల్లా వ్యవసాయాధికారి వాణి, పీఏసీఎస్ అధ్యక్షుడు పత్తిరెడ్డి మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతు భరోసాపై రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి వాణి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం రైతు వేదికల్లో రైతు భరోసాపై అన్నదాతల అభిప్రాయాలను సేకరించాలని సూచించిందన్నారు. ఈ మేరకు ప్రతి గ్రామంలో రైతుల అభిప్రాయాలను సేకరించి ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. రైతుల అభిప్రాయాలను పరిశీలించి రాష్ట్ర ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకొని రైతు భరోసా, వరికి బోనస్ వంటి వాటిపై విధి విధానాలను తయారు చేసి అమలు చేస్తుందన్నారు. పదెకరాల వరకు రైతు భరోసా సాయం ఇవ్వాలని ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదం తెలిపారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఉపాధ్యక్షుడు శీలం సురేందర్, కార్యదర్శి గాజంగి వేణు, డైరెక్టర్లు అల్లాల రమేశ్‌రావు, తోట గంగరాజం, బేతి రాజవ్వ, లక్ష్మారెడ్డి, నీలం లక్ష్మీనర్సయ్య, ముప్పారపు దేవమ్మ, ఆరుముల్ల గంగారాం, రైతులు పాల్గొన్నారు.

కొడిమ్యాల, జూన్ 29: మండలంలోని కొడిమ్యాల, పూడూర్, తిర్మలాపూర్ రైతు వేదికల్లో వ్యవసాయాధికారులు రైతు భరోసాపై రైతులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో మంచిర్యాల జిల్లా సహకార అధికారి రాంమోహన్, వ్యవసాయాధికారి పర్లపల్లి జ్యోతి, సహకార సంఘాల అధ్యక్షులు బండ రవీందర్‌రెడ్డి, పోలు రాజేందర్, సీఈవోలు గంగాధర్, రాజేందర్, కుర్షిద్, ఉపాధ్యక్షులు గడ్డం కవిత, సావనపల్లి రమేశ్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లా కేంద్రానికి కేటీఆర్ రాక

మల్యాల, జూన్ 29: జిల్లా కేంద్రంలోని ప్రాంతీయ తెలంగాణ భవన్‌కు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఈనెల ఒకటిన వస్తున్నట్లు చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ తెలిపారు. చొప్పదండి నియోజకవర్గంలోని మల్యాల, కొడిమ్యాల మండలాల నాయకులతో సమావేశమై భవిష్యత్ కార్యాచరణను రూపొందించనున్నట్లు పేర్కొన్నారు.

రక్తదానం

మేడిపల్లి, జూన్ 29: మేడిపల్లికి చెందిన తూర్పాటి రవి రక్తహీనతతో బాధపడుతూ జగిత్యాల పట్టణంలోని ప్రభుత్వ దవాఖానలో చికిత్స పొందుతున్నాడు. రక్తం అవసరం కాగా, కుటుంబసభ్యులు జీర్డ్స్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, వెంకట్రావుపేట మాజీ సర్పంచ్ అంగడి ఆనంద్‌కుమార్‌ను సంప్రదించారు. స్పందించిన ఆనంద్‌కుమార్ దవాఖానకు వెళ్లి రక్తదానం చేశాడు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుతూ, ఇప్పటి వరకు 60 సార్లు రక్తదానం చేసినట్లు తెలిపారు.

విద్యార్థి ప్రతిభ

మేడిపల్లి, జూన్ 29: భీమారం మండలం వెంకట్రావుపేట జడ్పీ ఉన్నత పాఠశాల తొమ్మిదో తరగతి విద్యార్థిని దీపిక ఎన్‌జీసీ జిల్లా కమిటీ నిర్వహించిన జిల్లా స్థాయి 'రెస్టోరేషన్, డిజర్టిఫికేషన్, డ్రాట్ రెజిలియన్స్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్' అంశంపై కవిత్వం, పోస్టర్ తయారీ విభాగంలో ప్రతిభ చూపి మొదటి బహుమతి సాధించింది. దీపికకు డీఈవో జగన్‌మోహన్‌రెడ్డి జ్ఞాపిక, ప్రశంసా పత్రంతోపాటు పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు.

పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలి

- వానకాలంలో పట్టణ వాసులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలి
- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

మున్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, జూన్ 29: పట్టణంలో పారిశుధ్య పనులు పకడ్బందీగా చేపట్టాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సూచించారు. జగిత్యాల మున్సిపల్ అత్యవసర సమావేశాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి మాట్లాడుతూ, వర్షాకాలంలో ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. సీజనల్ వ్యాధులపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. శుభ్రమైన తాగు నీటిని సరఫరా చేయాలని, బోనాల పండుగకు తగు చర్యలు చేపట్టాలన్నారు. యావర్ రోడ్డును వంద ఫీట్ల విస్తరణకు మున్సిపల్‌లో తీర్మానం చేసి ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి తెలిపారు. కాగా, పారిశుధ్య కార్మికుడు గంగారం ఉద్యోగ విరమణ పొందగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, చైర్‌పర్సన్, కమిషనర్, పాలకవర్గ సభ్యులు సన్మానించారు. సమావేశంలో మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ చిరంజీవి, కౌన్సిలర్లు, కో-ఆప్షన్ సభ్యులు, మున్సిపల్ మేనేజర్, ఇంజినీరింగ్, పారిశుధ్య విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు విప్, ఎమ్మెల్సీ వినతి

జగిత్యాల మున్సిపల్ మాస్టర్ ప్లాన్ అమలు, యావర్ రోడ్డును వంద ఫీట్లకు విస్తరించేందుకు వంద కోట్లు మంజూరు చేయించాలని విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కలెక్టర్ సత్యప్రసాద్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ మేరకు కలెక్టర్ సానుకూలంగా స్పందించారు.

పవన్ పర్యటనలో జన సేన నేతల అత్యుత్సాహం

- చెప్పులతోనే ఆలయంలోకి పార్టీ నాయకుడు

ఆలయం నుంచి చెప్పులను బయటకు తీసుకెళ్తున్న జనసేన నాయకుడు

మల్యాల, జూన్ 29: కొండగట్టు క్షేత్రంలో ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం, జనసేన పార్టీ అధినేత పవన్‌కళ్యాణ్ పర్యటనలో జనసేన పార్టీ నేతలు అత్యుత్సాహం చూపారు. కరీంనగర్‌కు చెందిన పార్టీ నాయకుడు ఏకంగా పాదరక్షలతో ఆలయానికి వచ్చాడు. ఈ క్రమంలో పలువురు సెక్యూరిటీ సిబ్బంది ఇదేంటని అడుగడంతో చెప్పులను చేత పట్టుకొని బయటికి పరుగు తీయగా, ఇదేం పద్ధతి అంటూ భక్తులు మండిపడ్డారు. మరో వైపు భక్తుల రద్దీ, అభిమానుల కోలాహలంతో కొండగట్టు కిక్కిరిసిపోగా, జేబు దొంగలు తమ చేతివాటం చూపగా, బాధితులు లబోదిబోమన్నారు.

మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘ సభ్యులకు సత్కారం

మేడిపల్లి, జూన్ 29: మండల కేంద్రంలో మహిళా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం జిల్లా అధ్యక్షురాలు రమ్య, ఉపాధ్యక్షురాలు దేశవేని రమ్య, కార్యదర్శి ఆర్మూరి లత, డైరెక్టర్లు తోపారపు రేఖ, తోపారపు మానస, ఆర్మూరి లత, ఐలేని లావణ్య, ఆర్మూరి సూరమ్మ, దువ్వాక రజితను శనివారం గంగపుత్ర సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి తోకల రవీందర్, జిల్లా ఉపాధ్యక్షుడు తోకల నర్సయ్య, మేడిపల్లి, భీమారం మండలాధ్యక్షులు దేశవేని కృష్ణ, దేశవేని రాజములు శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో గంగపుత్ర సంఘం ఉమ్మడి మేడిపల్లి మాజీ మండలాధ్యక్షుడు తోకల ప్రభాకర్, ఫిషరీష్ మండలాధ్యక్షుడు జిల్లా రమేశ్, గంగపుత్ర సంఘం మండలాధ్యక్షుడు గడీల గంగాధర్, సంఘం సభ్యులు జిల్లా గంగారాం, తోపారపు అశోక్, తోపారపు భీమయ్య, తోపారపు శంకరయ్య తదితరులు పాల్గొన్నారు.

శ్రీరామ ధనుస్సుకు పూజలు

జగిత్యాల టౌన్/మల్యాల, జూన్ 29: జిల్లా కేంద్రంలోని కోదండ రామాలయంతో పాటు కొండగట్టు అంజన్న ఆయలంలో 13 కిలోల వెండి, కిలో బంగారంతో తయారు చేసిన శ్రీరామ ధనుస్సుకు పూజలు నిర్వహించారు. నిజామాబాద్‌కు చెందిన చల్లా శ్రీనివాస శాస్త్రి భక్తుల సహకారంతో ధనుస్సును తయారు చేయించారు. అన్ని ప్రముఖ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేసిన అనంతరం ఆయోధ్య రామమందిరంలో శ్రీరామ ధనుస్సును సమర్పించనున్నట్లు విశ్వహిందూపరిషత్ జిల్లా అధ్యక్షుడు బోయిని పద్మాకర్ తెలిపారు. కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ సభ్యులు గాజోజు సంతోష్, మామిడాల రాములు, జిట్టవేణి అరుణ్‌కుమార్, వడ్లగట్ట భూమేశ్, పరందాం, వేముల సంతోష్, ఏసీఎస్ రాజు, బిట్టు, రాజగోపాల్, మహేందర్, నాయకులు శ్రవన్‌కుమార్, తుకారాం, గజం రాజ్‌కుమార్, గాజోజు సంతోష్, మామిడాల రాములు, గాజుల మల్లేశం, సురేశ్, బొడిగ నరేశ్, వడ్లగట్ట భూమేశ్, వేముల సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పవన్ కళ్యాణ్ అభిమానుల సందడి

కొడిమ్యాల, జూన్ 29: ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ శనివారం కొండగట్టుకు రాగా అభిమానులు సందడి చేశారు. తుర్కాశీనగర్ నుంచి పూడూర్, నాచుపల్లి జేఎన్టీయూ మీదుగా ఆలయం వరకు భారీ ర్యాలీ తీశారు. దొంగలమర్రి స్టేజీ వద్ద, బృందావనం రిసార్ట్ వద్ద భారీ ఫ్లెక్సీలను ఏర్పాటు చేశారు. బృందావనం రిసార్ట్ వద్ద అభిమానులు ఘన స్వాగతం పలికారు.

భర్త వేధింపులు తాళ లేక భార్య ఆత్మహత్య

కథలాపూర్, జూన్ 29: కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన బాల్క రుచిత(32) భర్త వేధింపులు తాళలేక శనివారం ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం... కోరుట్ల మండలం చిన్నమెట్‌పల్లి గ్రామానికి చెందిన రుచితకు కథలాపూర్ మండలం తాండ్ర్యాల గ్రామానికి చెందిన బాల్క విజయ్‌తో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి పదేళ్ల కుమారుడు ఉన్నారు. రుచిత గ్రామంలో ఆశ కార్యకర్తగా పని చేస్తున్నారు. ఇటీవల రుచితను విజయ్ అనుమానిస్తూ వేధింపులకు గురి చేస్తున్నాడు. ఈ క్రమంలో మనస్తాపానికి గురై ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. రుచిత తల్లి గుమ్మడి గంగు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.

NT-97639-All

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571 91827 77194

జిల్లా గణాంకదర్శిని ఆవిష్కరణ

జగిత్యాల, జూన్ 29: గణాంక దినోత్సవాన్ని పురస్కరించుకొని కలెక్టర్ కార్యాలయంలో జిల్లా గణాంకదర్శినిని శనివారం కలెక్టర్ సత్యప్రసాద్, ముఖ్య ప్రణాళికా అధికారి పూర్ణచందర్, గణాంకాధికారి మల్లేశం విడుదల చేశారు. కార్యక్రమంలో జయశ్రీ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడాకారులకు అభినందన

జగిత్యాల, జూన్ 29: మహారాష్ట్రలోని పూణేలో గల ఛత్రపతి శివాజీ స్టేడియంలో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కిక్ బాక్సింగ్ పోటీల్లో జిల్లాకు చెందిన సాయిసృజన్, కృష్ణ, స్నిగ్ధ ప్రియా, వినన్య, హర్షిత్ ప్రతిభ చూపారు. క్రీడాకారులను శనివారం కలెక్టర్ సత్యప్రసాద్, కోచ్ రామాంజనేయులు అభినందించారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

జగిత్యాల, జూన్ 29: జిల్లా కేంద్రంలోని జంబిగద్దె ప్రాంతం, అశోక్ నగర్, మోతెరోడ్, నాగేంద్రనగర్, చిలుకవాడ, గాయత్రీ బ్యాంక్ ఏరియా, మోచి బజార్, బుక్కవాడ ప్రాంతాలకు ఆదివారం ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని టౌన్-2 ఏఈ సంతోష్‌కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

నగదు అందజేస్తున్న ముదిరాజ్ సంఘం సభ్యులు

కొడిమ్యాల, జూన్ 29: నల్లగొండ గ్రామానికి చెందిన దండు శేఖర్ ఇటీవల మృతిచెందాడు. బాధిత కుటుంబానికి శనివారం గ్రామ ముదిరాజ్ దర్శ యూత్ సంఘం సభ్యులు రూ. 10 వేల నగదుతో పాటు, 50 కిలోల బియ్యం అందజేశారు. కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు కడకుంట్ల శోభన్, యూత్ అధ్యక్షుడు తూడి సతీశ్, ఉపాధ్యక్షుడు రెడ్డవేని స్వామి, కోశాధికారి కూన రాజు, దండు శ్రీనివాస్, చిరవేణి మల్లేశం, దండు రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విరమణ పొందిన ఉద్యోగులకు సన్మానం

జగిత్యాల కలెక్టరేట్, జూన్ 29: జిల్లాలో ఏఎస్ఐలుగా విధులు నిర్వహిస్తున్న చంద్రశేఖర్, కరుణాకర్, అంజయ్య శనివారం ఉద్యోగ విరమణ పొందారు. వారిని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ అశోక్ కుమార్ శాలువాలతో సన్మానించి, ఉద్యోగ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు.

మొక్కలు నాటిన ఉపాధ్యాయులు, విద్యార్థులు

రాయికల్, జూన్ 29: మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో శనివారం ప్రపంచ చెట్ల దినోత్సవాన్ని పురస్కరించుకొని ఉపాధ్యాయులు, విద్యార్థులు మొక్కలు నాటారు. ప్రధానోపాధ్యాయుడు రాఘవులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన

మల్యాల, జూన్ 29: తక్కళ్లపల్లి గ్రామ శివారులోని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు సీజనల్ వ్యాధులు, ముందస్తు జాగ్రత్తలపై జిల్లా ఉపవైద్యాధికారి శ్రీనివాస్ వివరించారు. మండల వైద్యాధికారి మౌనిక, వైద్య సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులకు, కోడళ్లకు కౌన్సెలింగ్

జగిత్యాల/జగిత్యాల టౌన్, జూన్ 29: తల్లిదండ్రులను పట్టించుకోని కొడుకులు, కోడళ్లకు ఆర్డీవో మధుసూదన్ ఆదేశాల మేరకు ఆర్డీవో కార్యాలయ సమావేశ హాల్‌లో శనివారం ఏవో తఫజుల్ హుస్సేన్, సీనియర్ సిటిజన్స్ సంఘం జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్ కౌన్సెలింగ్ నిర్వహించారు. సారంగాపూర్ మండలం కోనాపూర్‌కు చెందిన పంగ రాజవ్వ, జగిత్యాల మండలం మోతె గ్రామానికి చెందిన పడాల గంగు, మోరపల్లి గ్రామానికి చెందిన సంపతి గంగయ్య, బీర్‌పూర్ మండలం కమ్మునూర్ గ్రామానికి చెందిన తోట భూమరాజం, గొల్లపల్లి మండలం ఇస్రాజ్‌పల్లికి చెందిన సంకటి రాజవ్వను కొడుకులు, కోడళ్లు పట్టించుకోకపోవడంతో కౌన్సెలింగ్ నిర్వహించి, వయో వృద్ధుల చట్టంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అధికారులు పద్మజ, కొండయ్య, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మెట్‌పల్లి, జూన్ 29: ఇంటితో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ కమిషనర్ మోహన్ సూచించారు. పట్టణంలో పారిశుధ్య పనులు, పొడి వనరుల సేకరణ కేంద్రాన్ని శనివారం ఆయన పరిశీలించారు. వానలు కురుస్తున్న నేపథ్యంలో డ్రైనేజీలను శుభ్రం చేయాలని, జనావాసాల మధ్య నీరు నిలిచి ఉండకుండా పనులు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఆయన వెంట శానిటరీ ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, ముజీబ్ తదితరులున్నారు.

విరమణ పొందిన ప్రధానోపాధ్యాయుడికి సన్మానం

కోరుట్ల, జూన్ 29: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్న మద్దికుంట భూమయ్య ఉద్యోగ విరమణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు భూమయ్యను శాలువా, పూలమాలలతో సత్కరించి, వీడ్కోలు పలికారు. ఇక్కడ ఎంఈవో నరేశం, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు మోహన్ ప్రసాద్, భానుమూర్తి, కృష్ణమోహన్, కిషన్, శ్రీనివాసమూర్తి, తదితరులున్నారు.

ప్రైవేట్ పాఠశాలల్లో ఏబీవీపీ నాయకుల నిరసన

కోరుట్ల, జూన్ 29: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పలు ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు పాఠ్య పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపిస్తూ శనివారం ఏబీవీపీ నాయకులు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో పార్టీ నగర కార్యదర్శి మాడవేణి సునీల్, నాయకులు మహదేవ్, సూరజ్, రంజిత్, నితీశ్‌కుమార్, హర్షవర్ధన్, లవన్ తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతాంధ్రా కళాశాల పరిశీలన

ధర్మపురి, జూన్ 29: ధర్మపురిలోని సంస్కృతాంధ్రా కళాశాలకు పూర్వ వైభవం తీసుకువస్తానని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ హామీ ఇచ్చారు. శనివారం ఆర్‌జేడీ యాదగిరితో కలిసి కళాశాలను పరిశీలించారు. అనంతరం విప్ మాట్లాడుతూ, త్వరలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో మాట్లాడి కళాశాలను పునఃప్రారంభం చేయిస్తానన్నారు. ప్రిన్సిపాల్ ప్రభాకర్, కార్యదర్శి రామకృష్ణయ్య, నాయకులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ

వెల్గటూర్, జూన్ 29: వెల్గటూర్ మండలం పైడిపల్లి మాజీ సర్పంచ్ గంగుల నగేశ్ తండ్రి సత్తయ్య ఇటీవల మృతి చెందాడు. కాగా, బాధిత కుటుంబాన్ని శనివారం మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పరామర్శించారు. సత్తయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గంగుల అశోక్, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు చల్లూరి రాంచందర్ గౌడ్, నాయకులు మెతుకు స్వామి, మూగల సత్యం, జూపాక కుమార్, కొప్పుల సురేశ్, పల్లపు మల్లేశ్, చాటకొల్లు నరేశ్, గంగుల నరేశ్, పాక వేణు, సంగ కొమురయ్య తదితరులు పాల్గొన్నారు.

మహిళా శక్తి యూనిట్ల పరిశీలన

జగిత్యాల రూరల్, జూన్ 29: జగిత్యాల రూరల్ మండలం లక్ష్మీపూర్ గ్రామంలో మహిళా శక్తి యూనిట్లను విశాఖపట్నం వాసులు (జిల్లా జడ్జి నీలిమ సోదరీమణులు లలితకుమారి, ధనలక్ష్మి) శనివారం సందర్శించారు. యూనిట్ ఏర్పాటు, మార్కెటింగ్, తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే, అంతకు ముందు గ్రామంలోని కుట్టు కేంద్రాన్ని డీఆర్డీవో సంపత్ రావు సందర్శించారు. డీపీఎం వెంకటేశ్, ఏపీఎం గంగాధర్, మండల సమాఖ్య అధ్యరాలు మారు సత్తవ్వ, తదితరులు పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ కార్యవర్గం

మెట్‌పల్లి, జూన్ 29: లయన్స్ క్లబ్ పట్టణ నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ఇల్లెందుల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా గుండా రాకేశ్, కోశాధికారిగా నాంపల్లి వేణుగోపాల్, జోన్ చైర్మన్‌గా గడ్డం శంకర్‌రెడ్డి ఎన్నికయ్యారు. వీరిని క్లబ్ సభ్యులు అభినందించారు. ఈ నెల 30న కోదండరామాలయంలో ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు కార్యవర్గ సభ్యులు తెలిపారు.

చట్టాలపై అవగాహన

సారంగాపూర్, జూన్ 29: లక్ష్మీదేవిపల్లిలోని ఎస్సీ కాలనీలో శనివారం రెవెన్యూ అధికారులు పౌరహక్కుల దినోత్సవంలో భాగంగా చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా కాలనీల్లో అధికారులు పర్యటించి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సింగిల్ విండో చైర్మన్ నర్సింహా రెడ్డి, ఆర్ఐ కృష్ణ, కార్యదర్శి సర్వశ్రేష్ట పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు పరామర్శ

కొడిమ్యాల, జూన్ 29: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం భార్య రూపాదేవి ఇటీవల మృతిచెందగా శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో మండల బీఆర్ఎస్ నాయకులు పరామర్శించారు. ఇక్కడ సింగిల్ విండో చైర్మన్ పోలు రాజేందర్, మాజీ సర్పంచులు పునుగోటి కృష్ణారావు, ఎగుర్ల తిరుపతి, మల్యాల మహిపాల్, గరిగంటి మల్లేశం, చెక్కపల్లి స్వామిరెడ్డి, తునికి నర్సయ్య, నాయకులు బొడ్డు రమేశ్, వేణురావు, కొత్తూరి స్వామి, ల్యాగల రాజేశం, గంగిశెట్టి నారాయణ, తదితరులున్నారు.

డీఎస్ మృతికి సంతాపం

మెట్‌పల్లి, జూన్ 29: రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్, ఆదిలాబాద్ మాజీ ఎంపీ రమేశ్‌రాథోడ్ మృతి పట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతిని వ్యక్తం చేశారు. వారి మృతి పట్ల ప్రగాఢ సంతాపం తెలిపారు.

కోరుట్ల, జూన్ 29: రాజ్యసభ మాజీ సభ్యుడు ధర్మపురి శ్రీనివాస్ మృతికి టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి, బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి కస్తూరి లక్ష్మీనారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు తులసీ కృష్ణ ఒక ప్రకటనలో సంతాపం తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ప్రక్రియ సమయంలో డీఎస్ కీలక పాత్ర పోషించారని గుర్తు చేశారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

వెల్గటూర్, జూన్ 29: సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యాధికారి శ్రావణ్ సూచించారు. రాజక్కపల్లిలో శనివారం ఆయన వైద్య సిబ్బందితో కలిసి పర్యటించారు.

మంచినీటి బావి శుభ్రం

- 'నమస్తే' కథనానికి స్పందన



మంచినీటి బావిలో శుభ్రం చేస్తున్న గ్రామ పంచాయతీ సిబ్బంది

కొడిమ్యాల, జూన్ 29: మండల కేంద్రంలోని ధోబీఘాట్ వద్ద ఉన్న మంచినీటి బావిలో నాచు, పాకురు తెలడంతో శనివారం 'నమస్తే తెలంగాణ'లో 'అపరిశుభ్రంగా మంచినీటి బావి' కథనం ప్రచురితమైంది. స్పందించిన గ్రామ పంచాయతీ కార్యదర్శి వంశీవర్ధన్ పంచాయతీ సిబ్బందితో కలిసి శనివారం బావి వద్దకు వెళ్లాడు. బావిలో పంచాయతీ సిబ్బందితో నాచు, పాకురు తొలగించారు. బ్లీచింగ్ పౌడర్ చల్లి శుభ్రం చేయించారు. గ్రామంలోని నీళ్ల ట్యాంక్‌లను కూడా శుభ్రం చేయించారు. కార్యక్రమంలో గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అంగన్‌వాడీలో అన్నీ ఆయా

మెట్‌పల్లి రూరల్, జూన్ 29: మెట్‌పల్లి మండలం మెట్లచిట్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రం-1 టీచర్ ఏడాది క్రితం సూపర్‌వైజర్‌గా ఉద్యోగోన్నతిపై వెళ్లింది. మరో కేంద్రానికి చెందిన అంగన్‌వాడీ టీచర్‌కు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. కానీ సమయాభావం వల్ల టీచర్ ఈ కేంద్రానికి రోజు రాలేకపోతున్నది. దీంతో ఈ కేంద్రంలో ఆయాగా ఉన్న సుంకెట గంగు అన్నీ తానై విధులు నిర్వర్తిస్తున్నది. కేంద్రాన్ని శుభ్రంగా ఉంచడం, అన్నం వండిపెట్టడంతోనే సరిపెట్టకుండా చిన్నారులకు తెలుగు, ఆంగ్ల అక్షరమాల, అంకెలు నేర్పుతున్నది. కేంద్రంలో 14 మందికి గానూ శనివారం తొమ్మిది మంది చిన్నారులు హాజరయ్యారు. కాగా, వారికి పలకలపై ఏ, బీ, సీ, డీలతో పాటు వన్, టూ, త్రీలు పెట్టించింది.



చిన్నారులకు అక్షరాలు పెట్టిస్తున్న ఆయా గంగు